
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
శ్రీకాకుళం
జిల్లా వార్తలు
ఆదివారం 24 నవంబరు 2024



1 నుంచి ఆదిత్యాలయంలో ప్లాస్టిక్ నిషేధం

అరసవల్లి, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయంతోపాటు పరిసరాల్లో డిసెంబరు 1వ తేదీ నుంచి ప్లాస్టిక్ కవర్ల విని యోగాన్ని నిషేధించనున్నారు. ఈ మేరకు శనివారం శ్రీకాకుళం నగర పాలక సంస్థ కమిషనర్ ప్రసాదరావు.. ఆలయ అధికారులు, సిబ్బంది, దుకాణదారులతో సమావేశం నిర్వహించారు. ప్లాస్టిక్ వినియోగంతో కలిగే అనర్థాలు, నిషేధం అమలుపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో వై.భద్రాజీ, సూపరింటెండెంట్ ఎస్.కనకరాజు తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాకుళం

కొన్ని శాఖలపైనే..



మాట్లాడుతున్న జడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ, పక్కన కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తదితరులు

- జడ్పీ సర్వసభ్య సమావేశంలో చర్చ
- అధిపత్యం కోసం వైసీపీ జడ్పీటీసీలు, ఎంపీపీల ఆరాటం
- అధికారుల తీరుపై సభ్యుల మండిపాటు
- విచారణ జరిపి నివేదిక సిద్ధం చేయాలన్న ఎంపీ కలిశెట్టి
- ప్రొటోకాల్‌ను పాటించాల్సిందే: కలెక్టర్

శ్రీకాకుళం, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశంలో కొన్ని ప్రభుత్వ శాఖలపైనే చర్చ సాగింది. శనివారం ఉదయం 10 గంటలకు ఆరంభించాల్సిన ఈ సమావేశం అధికారులు, ప్రజాప్రతినిధుల రాక ఆలస్యంగా కారణంగా.. 11.20కి ప్రారంభమైంది. ఆర్‌డబ్ల్యుఎస్, ఉపాధిహామీ, డీఆర్డీఏ, విద్యుత్, పంచాయతీరాజ్, మైన్స్ శాఖల పని తీరుపైనే చర్చ జరిగింది. ఉచిత ఇసుకలో అక్రమాలు, ధాన్యం కొనుగోలు కేంద్రాల ప్రారంభంలో జాప్యంపై తదితర అంశాల్లో అధికారుల నిర్లక్ష్యపు తీరుపై సభ్యులు మండిపడ్డారు. గత ప్రభుత్వ హయాంలో చేసిన తప్పిదాలపై కొంతమంది సభ్యులు నిలదీయగా.. సమావేశం కాస్త వాడివేడిగా సాగింది.

● జడ్పీటీసీల మధ్య ప్రశ్నల యుద్ధం

కీలక ప్రజాప్రతినిధులు హాజరుకాక పోవడంతో వైసీపీ జడ్పీటీసీలు, ఎంపీపీలు అసలు విషయాన్ని పక్కనబెట్టి (మిగతా 6వ పేజీలో..)

● కీలక ప్రజాప్రతినిధులు దూరం..

జడ్పీ సర్వసభ్య సమావేశానికి కీలక ప్రజాప్రతినిధులు ఎవరూ హాజరు కాలేదు. కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు ఇతర కార్యక్రమాల కారణంగా రాలేదు. వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, ప్రభుత్వ విప్ బెందాళం అశోక్, ఎమ్మెల్యేలు గౌతు శిరీష, గొండు శంకర్, బగ్గు రమణమూర్తి, కూన రవికుమార్, మామిడి గోవిందరావు, నడుకుదిటి ఈశ్వరరావు.. అసెంబ్లీ సమావేశాలు ముగిసినా విజయవాడలోనే ఉన్నారు. దీంతో వీరు కూడా సమావేశానికి హాజరుకాలేదు. కాగా.. వైసీపీ ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ కూటమి ప్రభుత్వాన్ని విమర్శిస్తూ శ్రీకాకుళంలో ప్రెస్‌మీట్ నిర్వహించారు. కానీ ఆయన కూడా జడ్పీ సమావేశానికి రాలేదు. విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు హాజరై రెండు గంటలపాటు ఉండివెళ్లిపోగా.. రెండోపూట సమావేశానికి ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ హాజరయ్యారు. ప్రొటోకాల్ అంశంపై సభలో ప్రస్తావించారు. 'అధికారంలో లేనివారి కుటుంబాలను ప్రభుత్వ కార్యక్రమాలకు పిలుస్తున్నారు. కానీ స్థానిక ప్రజాప్రతినిధులను పిలవడంలేదు. ఎక్కడా ప్రొటోకాల్ పాటించడంలేదు. దీనిపై చర్యలు తీసుకోవాలి' అని తెలిపారు. దీనిపై కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ మాట్లాడుతూ.. 'అధికారులంతా ప్రతి ప్రభుత్వ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులందరినీ.. అలాగే శిలాఫలకాల ఆవిష్కరణ విషయంలో ప్రొటోకాల్ పాటించాలి. ప్రొటోకాల్ కోసం ప్రభుత్వం ప్రత్యేక ఉత్తర్వులు విడుదల చేసింది. దీనిపై అవగాహన పెంచుకోవాల'ని సూచించారు.

● అర్హుల పింఛన్లు తొలగిస్తున్నారు

కొన్ని నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేల సిఫార్సులతో అర్హుల పింఛన్లు తొలగిస్తున్నారు. పింఛన్‌దారులను విచారించేందుకు వెళ్లిన అధికారులు.. నివేదికలో 'డోర్‌లాక్' అని ప్రస్తావించి పింఛన్లు తొలగిస్తున్నారు. అర్హులు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదు. డీఆర్డీఏ పీడీ చర్యలు తీసుకోవాలి. ఇసుకరీచ్‌ల్లో సీసీ కెమెరాలు ఎందుకు పనిచేయడం లేదు?. ఇసుక సరఫరాలో అక్రమాలు జరగకుండా చూడాలి.

- పిరియా విజయ, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్

జిల్లా అభివృద్ధిపైనే మాట్లాడాలి

జిల్లా అభివృద్ధికి సంబంధించి విషయాలనే సభ్యులు ప్రస్తావించాలి. గత ప్రభుత్వం గొప్పగా చేసింది.. ఈ ప్రభుత్వం చేయలేదని విమర్శలు చేసుకోవడం సరికాదు. వేదికపై ఉన్నవారు కూడా గౌరవంగా మాట్లాడాలి. 2014-2019, అలాగే 2019-2024, ప్రస్తుతం ఈ ఆరు నెలల్లో ఇసుక విషయానికి సంబంధించి ఓ నివేదిక తయారు చేయాలని కలెక్టర్‌ను కోరుతున్నాను. నివేదికపై విచారణ చేసి చర్యలు తీసుకుందాం.

- కలిశెట్టి అప్పలనాయుడు, ఎంపీ, విజయనగరం

● కిడ్నీ రోగులు పెరుగుతున్నారు

ఉద్దానం మాదిరిగా హిరమండలంలో మూడు ప్రాంతాల్లో కిడ్నీ రోగుల సంఖ్య పెరుగుతోంది. ఏటా పదుల సంఖ్యతో మరణాలు సంభవిస్తున్నాయి. దీనిపై దర్యాప్తు చేసి చర్యలు తీసుకోండి. అలాగే అన్ని ప్రాంతాల్లో కేన్సర్ రోగుల సంఖ్య పెరుగుతోంది. వారు.. కీమోథెరపీ, ఇతరత్రా వైద్యసేవల కోసం విశాఖలో మహాత్మాగాంధీ కేన్సర్ ఆసుపత్రికి వెళ్లి చికిత్స తీసుకుంటున్నారు. రోగులకు ఖర్చు మోపెడవుతోంది. కేన్సర్ రోగులకూ పింఛన్ మంజూరు చేయాలి. జల్‌జీవన్ మిషన్‌లో పాతపట్నం నియోజకవర్గానికి తాగునీటిని అందించాలి. గత ప్రభుత్వం సన్నబియ్యం అని చెప్పి నాణ్యమైన బియ్యం అంటూ మాటమార్చి మోసం చేసింది. ఇప్పుడు ప్రభుత్వం కచ్చితంగా పనిచేస్తుంది.

- పొగిరి బుచ్చిబాబు, జడ్పీటీసీ


సమావేశానికి హాజరైన ఎంపీ కలిశెట్టి, జడ్పీటీసీలు, ఎంపీపీలు


దళితవాడలో కాలిపోతున్న ఇళ్లు

దళితవాడలో అగ్నిప్రమాదం


రోదిస్తున్న బాధితులు

- తొమ్మిది పూరిళ్లు దగ్ధం
- సర్వం కోల్పోయిన బాధితులు
- ఎంపీ, ఎమ్మెల్యే తనయుడు పరామర్శ

జి.సిగడాం, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): జి.సిగడాం మండలం సంతవురిటి పాత దళితవాడలో శనివారం మధ్యాహ్నం అగ్నిప్రమాదం సంభవించింది. తొమ్మిది పూరిళ్లు దగ్ధమయ్యాయి. గ్రామానికి చెందిన కేతుబారిక సోములు భార్య దుర్గమ్మ వంట చేస్తుండగా.. ప్రమాదవశాత్తు అగ్నికీలలు వ్యాపించాయి. ఆమెకు సరిగా కళ్లు కనిపించవు. ప్రమాదం జరిగిన సమయంలో ఇంట్లో కూడా ఎవరూ లేరు. ఇరుగుపొరుగు వారు కూడా పొలంలో వరికోతల పనులకు వెళ్లిపోయారు. కాగా.. రెప్పపాటులో పొగ కమ్ముకుని.. మంటలు వ్యాపించాయి. దీంతో కేతుబారిక సోములు, లండ లక్ష్మణరావు, కోడిగుడ్ల అదెమ్మ, తలే సంతోష్‌కుమారి, కేతుబారిక అసిరయ్య, కేతుబారిక దాలెమ్మ, కేతుబారిక ఎరకయ్యమ్మ, కరజాడ ఈశ్వరరావు, కేతుబారిక శంకరరావు పూరిళ్లు కాలి బూడిదయ్యాయి. బాధితులంతా కట్టుబట్టలతో రోడ్డున పడ్డారు. ఇంట్లో దాచుకున్న డబ్బులు, బంగారు ఆభరణాలు కూడా కాలిపోవడంతో బోరున విలపించారు. గ్రామస్థుల సమాచారం మేరకు పొందూరు, రాజాం అగ్నిమాపక కేంద్ర సిబ్బంది వచ్చి మంటలను అదుపు చేశారు. రెవెన్యూ సిబ్బంది కూడా ఘటనా స్థలానికి చేరుకున్నారు. సుమారు రూ.9లక్షల ఆస్తి నష్టం వాటిల్లిందని ప్రాథమికంగా అంచనా వేశారు. బాధిత కుటుంబాలకు మూడేసి కేజీల బియ్యం, నిత్యావసర సరుకులు అందజేశారు.

● విలపించిన బాధితులు

అగ్నిప్రమాదంలో నగదు కాలిపోవడంతో బాధితులు బోరున విలపించారు. 'నాకు ముగ్గురు కుమారులు. ఆటో, తాపీపని, వ్యవసాయ కూలి చేసి నా దగ్గర దాచిన రూ.1.20 లక్షలు కాలి బూడిదయ్యాయి' అని కేతుబారిక ఎరుకయ్యమ్మ రోదించింది. అలాగే కుమారులు చీటీ కట్టి తెచ్చి ఇచ్చిన నగదు రూ.50వేలు అగ్నికి ఆహుతైందని కోడిగుడ్ల అదెమ్మ కంట తడిపెట్టారు. అసిరయ్యకు చెందిన రూ.30వేలు, శంకరరావుకు చెందిన రూ.20వేల (మిగతా 6వ పేజీలో..)

కందివలస గెడ్డ పరిశీలన

- శాంపిల్ల సేకరణ.. ల్యాబ్‌కు తరలింపు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

రణస్థలం, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): పైడిభీమవరం పారిశ్రామిక వాడలోని కందివలస గెడ్డను కాలుష్య నియంత్రణ శాఖ అధికారులు శనివారం పరిశీలించారు. పారిశ్రామికవాడలోని పరిశ్రమల వ్యర్థాలు కందివలస గెడ్డలో కలుస్తుండడంపై శనివారం 'ఆంధ్రజ్యోతి'లో శనివారం ప్రచురితమైన 'ఉపాధి లేదు.. కాలుష్యమే' అన్న కథనానికి అధికారులు స్పందించారు. కందివలస గెడ్డ పరివాహక ప్రాంతాల్లో భూగర్భ జలాలు కలుషితంతో ఒక వైపు, పారిశ్రామిక వాడ వాయు కాలుష్యంతో మరోవైపు పరిసర గ్రామాల ప్రజలు రోగాలబారిన పడుతున్నారు. స్థానికులకు పరిశ్రమల్లో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కూడా దొరకడం లేదు. ఈ విషయమై 'ఆంధ్రజ్యోతి' కథనం చర్చనీయాంశమైంది. దీనిపై కాలుష్య నియంత్రణ శాఖ ఈఈ బి.కరుణశ్రీ స్పందించారు. ఆమె ఆదేశాల మేరకు ఏఈ సీహెచ్ హరీష్ కందివలస గెడ్డలో జలాలను శనివారం పరిశీలించారు. నీటి శాంపిల్లను సేకరించి ల్యాబ్‌నకు తరలించారు. గెడ్డలో పరిశ్రమల వ్యర్థాలు విడిచిపెట్టినట్లు తేలితే నోటీసు లిస్తామని పేర్కొన్నారు. అవసరమైతే కేసులు నమోదు చేస్తామని తెలిపారు. వారి వెంట పారిశ్రామికవాడలోని వివిధ పరిశ్రమల ప్రతినిధులు ఉన్నారు.


కందివలస గెడ్డలో నీటి శాంపిల్లను సేకరిస్తున్న కాలుష్య నియంత్రణ అధికారి



మద్దిలోడిపేట సమీపంలో ఉన్న ఎస్‌డబ్ల్యూసీ గోదాం

తీరని గోదాముల సమస్య

- లెవీ సమయంలో మిల్లర్ల అవస్థలు
- ప్రతిపాదనలకే పరిమితమైన 'ఎఫ్‌సీఐ'

టెక్కలి, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): జిల్లాలో రెండు దశాబ్దాలుగా గోదాముల సమస్య తీరడం లేదు. జిల్లావ్యాప్తంగా సుమారు 275 మిల్లులు ఉండగా, ఏటా ఐదు నుంచి ఏడు లక్షల టన్నుల లెవీని మిల్లర్లు అందిస్తున్నారు. అయితే సరిపడా గోదాములు లేకపోవడంతో విజయనగరం, విశాఖ జిల్లాలకు కూడా జంబ్లింగ్ పద్ధతిలో లెవీని అధికారులు తరలిస్తున్నారు. జిల్లాలో గోదాముల నిర్మాణానికి ఎఫ్‌సీఐ ప్రతిపాదనలే తప్ప ఆచరణకు నోచుకోవడం లేదు. కోటబొమ్మాళి, టెక్కలి, పలాస తదితర ప్రాంతాల్లో ఎఫ్‌సీఐ గోదాముల నిర్మాణం ప్రతిపాదనలకే పరిమితమైంది. జిల్లాలో ఎఫ్‌సీఐ పరిధిలో ఆమదాలవలస, నిమ్మాడ ప్రాంతాల్లో చెరో 30వేల మెట్రిక్ టన్నులు, తామరాపల్లిలో 18వేల మెట్రిక్‌టన్నులు, ఆమదాలవలస ఇన్వెస్టర్స్ పరిధి, పలాస, తిలారులో మిల్లర్ల అసోసియేషన్ ఆధ్వర్యంలో చెరో 20వేల మెట్రిక్ టన్నుల గోదాములు ఉన్నాయి. ఇక స్టేట్‌వేర్ హౌసింగ్ కార్పొరేషన్ పరిధిలో ఆమదాలవలసలో 25వేలు, 20వేల మెట్రిక్ టన్నుల గోదాములు, పలాసలో 17వేల మెట్రిక్‌టన్నులు, కేసీఆర్ గడ్డెయ్య గోదాములో 4వేల మెట్రిక్‌టన్నులు, పొందూరు, నరసన్నపేట, కంచిలి, కొత్తూరు మండలాల్లో పదేసివేల మెట్రిక్‌టన్నులు మొత్తంగా లక్షా4వేల మెట్రిక్‌టన్నుల గోదాములు ఉన్నాయి. జిల్లాలో మిల్లుల సంఖ్య, లెవీని బట్టి మరో లక్ష మెట్రిక్‌టన్నుల నిల్వకు గోదాములు అవసరముంది. గోదాములు నిర్మిస్తే లెవీ సమయంలో తమకు ఇబ్బందులు తప్పుతాయని మిల్లర్లు పేర్కొంటున్నారు. డెమరేజ్ చార్జీలు కూడా తగ్గే అవకాశం ఉందని చెబుతున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి గోదాముల నిర్మాణానికి చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

15,287

- ఇదీ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటర్ల ముసాయిదా జాబితాలోని ఓటర్ల సంఖ్య
- పురుషులు 9,638, మహిళలు 5,647 మంది
- వచ్చే నెల తొమ్మిదో తేదీ వరకూ అభ్యంతరాలు
- ఓటరుగా నమోదుకూ కూడా అవకాశం
- వచ్చే నెల 30న తుది ఓటర్ల జాబితా



విశాఖపట్నం, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ శాసన మండలి నియోజకవర్గ ఓటర్ల ముసాయిదా జాబితా శనివారం విడుదల చేశారు. ఆరు జిల్లాల పరిధిలో 15,287 మంది ఓటర్లుగా నమోదయ్యారు. వీరిలో 9,638 మంది పురుషులు, 5,647 మంది మహిళలు ఉన్నారు. ఓటు నమోదుకు 17,404 దరఖాస్తులు రాగా 2,117 తిరస్కరించి, 15,287 మందితో ముసాయిదా జాబితా రూపొందించారు. అత్యధికంగా శ్రీకాకుళం జిల్లాలో 3,906 మంది టీచర్లు ఓటర్లుగా నమోదయ్యారు. మహిళా ఉపాధ్యాయ ఓటర్ల వివరాలు పరిశీలిస్తే విశాఖపట్నం జిల్లాలో అత్యధికంగా 1,421 మంది ఉండగా, అతి తక్కువగా అల్లూరి సీతారామరాజు జిల్లాలో 527 మంది ఉన్నారు. కాగా ముసాయిదా ఓటర్ల జాబితాపై శనివారం నుంచి అభ్యంతరాలు స్వీకరిస్తున్నామని జిల్లా ఎన్నికల అధికారి, విశాఖపట్నం కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర్ ప్రసాద్ తెలిపారు. వచ్చే నెల తొమ్మిదో తేదీ వరకు (మిగతా 6వ పేజీలో..)

సిక్కోలులో 3,906 మంది..

శ్రీకాకుళం, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి జిల్లాలో మొత్తం 3,906 మంది గురువులు ఓటర్లుగా ఉన్నట్టు నిర్ధారణ అయింది. ఈమేరకు శనివారం కలెక్టరేట్‌లో ఎన్నికల విభాగ అధికారులు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటర్ల జాబితా డ్రాఫ్ట్‌ను ప్రచురించారు. మొత్తం 31 పోలింగు స్టేషన్ల పరిధిలో 2,725 మంది పురుషులు, 1,181 మంది మహిళా ఓటర్లు ఉన్నట్లు తెలిపారు.


శ్రీకాకుళం: సత్యసాయి సంకీర్తన ఊరేగింపులో పాల్గొన్న భక్తులు

వైభవంగా సత్యసాయి జయంతి

శ్రీకాకుళం కల్చరల్, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): జిల్లావ్యాప్తంగా శనివారం భగవాన్ సత్యసాయి బాబా జయంతిని భక్తులు వైభవంగా నిర్వహించారు. తెల్లవారుజామున సుప్రభాత సేవతో కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. ప్రత్యేకపూజలు, వేద పారాయణం, దివ్య నామ సంకీర్తన, పల్లకి సేవ, నగర సంకీర్తన, భజనలు, తదితర కార్యక్రమాలు నిర్వహించారు. సత్యసాయి చిత్రపటాలు, పాదుకలను మంగళ వాయిద్యాల నడుమ ఊరేగించారు. పలుచోట్ల కేక్‌లు కట్ చేశారు. శ్రీకాకుళం న్యూకాలనీలోని సత్యసాయి మందిరంలో ఊయల ఉత్సవం, పెద్దమందిరంలో నగర సంక్తీరన నిర్వహించారు. నిరుపేదలు, వృద్ధులకు దుప్పట్లు, వస్త్రాలను అందజేశారు. కార్యక్రమంలో జిల్లా సత్యసాయి మందిరం అధ్యక్షుడు సూర రామచంద్రరావు, వివిధ ఆలయాల కన్వీనర్లు జయరాం, మురళీ, ఆయా సమితుల ప్రతినిధులు, పెద్ద ఎత్తున సాయి భక్తులు పాల్గొన్నారు.

అమ్మో.. చలి



- వైరస్ వ్యాప్తికి ఇదే సీజన్
- జాగ్రత్తలు పాటించపోతే కష్టం
- వృద్ధులు, చిన్నారులపై తీవ్ర ప్రభావం

6లో

అదానీని అరెస్టు చేయాలి

- కాంగ్రెస్ నాయకుల డిమాండ్ ● శ్రీకాకుళంలో ర్యాలీ

7లో

మాదకద్రవ్యాలు విక్రయిస్తే కఠిన చర్యలు

- ఏఎస్పీ శ్రీనివాసరావు
- 10 కేజీల గంజాయి స్వాధీనం, ఐదుగురి అరెస్ట్

8లో



నరసన్నపేట పరిసరాల్లో మంచు కురుస్తున్న దృశ్యం

అమ్మో.. చలి

- వైరస్ వ్యాప్తికి అవకాశం అధికం
- జాగ్రత్తలు పాటించకపోతే కష్టం
- వృద్ధులు, చిన్నారులపై తీవ్ర ప్రభావం

నరసన్నపేట, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో చలి.. మంచు ప్రభావం ఒక్కసారిగా పెరిగాయి. ఇలాంటి పరిస్థితిలో ఆరోగ్యపరంగా జాగ్రత్తలు తీసుకోవలసిన అవసరం ఉంది. లేదంటే వివిధ రకాల వ్యాధులు ప్రభావం చూపే అవకాశం ఉంది. ముఖ్యంగా వృద్ధులు, చిన్నారులు అప్రమత్తంగా ఉండాల్సిన సమయమిది. చలి తీవ్రత కారణంగా ఇన్‌ఫ్లూమెంజా, పాల్సీపారం వంటి వైరస్‌లు దాడి చేస్తాయి. దీనివల్ల న్యూమోనియా సోకి ఊపిరితిత్తులపై తీవ్ర ప్రభావం చూపుతుంది. చేతివేళ్లు, కాలివేళ్లు, చెవులు తదితర భాగాలకు రక్త ప్రసరణ తగ్గి.. చర్మ వ్యాధులకు దారి తీస్తుంది. ఫంగస్ సమస్య తలెత్తుతుంది. రోగ నిరోధక శక్తి సన్నగిల్లుతుంది. డస్ట్ ఎలర్జీ, ఊపిరితిత్తుల ఎలర్జీ వస్తుంది



ఏం చేయాలంటే..

- మధుమేహం, గుండె, ఊపిరితిత్తుల వ్యాదులతో బాధ పడేవారు సరైన జాగ్రత్తలు తీసుకోవాలి.
- శరీరాన్ని పూర్తిగా కప్పేలా దుస్తులు ధరించాలి.
- త్వరగా జీర్ణమయ్యే ఆహారం తీసుకోవాలి.
- జలుబు, దగ్గు రెండు రోజులకు మించి ఉంటే వైద్యులను సంప్రదించాలి.
- నీళ్ల ఎక్కువగా తాగాలి. ఫ్రిజ్‌లో ఉన్న ఆహార పదార్థాలు, నీళ్ల తాగకూడదు.
- వేజలీన్, పెట్రోలియం జెల్లీలు ఉపయోగించాలి.



- చలిగా ఉండే సమయంలో బయట తిరగరాదు.
- ఆస్తమా ఉన్న వారు మరింత జాగ్రత్తగా ఉండాలి.
- దగ్గు, జలుబు ఉన్న వారికి దూరంగా ఉండాలి.
- తెల్లవారు జామున, రాత్రి వేళల్లో స్నానం చేయకూడదు.
- కాలుష్య ప్రాంతాలలో తిరగకూడదు.
- పొగ తాగేవారికి దూరంగా ఉండాలి.



చలి నుంచి ఉపశమనం ఇలా..

గుండెపోటు ముప్పు

చలికాలంలో ముఖ్యంగా నవంబరు, డిసెంబరు, జనవరి నెలల్లో ఉష్ణోగ్రతలు భారీగా పడిపోతాయి. పొగమంచు, చల్లని గాలుల వల్ల ఉదయం పూట చలి తీవ్రత మరింత అధికం. ఈ పరిస్థితుల్లో వాకింగ్, జాకింగ్ చేసే వారు ముందు జాగ్రత్తలు తీసుకోకుంటే గుండెపోటు వచ్చే అవకాశం ఉందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. ఈ సమస్యలు ఉన్నవారు చలికాలం ఉదయం పూట వాకింగ్‌కు వెళ్లకపోవడం మంచిదని సూచిస్తున్నారు. తప్పనిసరిగా వెళ్లాల్సి వస్తే సూర్యకిరణాలు పడ్డాక వెళ్లడం శ్రేయస్కరం. అప్పటికీ ఇబ్బందికర పరిస్థితులు ఉంటే కార్డియాలజిస్టును సంప్రదించి జాగ్రత్తలు తీసుకోవడం ఉత్తమం.

చిన్నారులకు జాగ్రత్తలివీ..

- చిన్నారులను చలిలో బయటకు తీసుకురాకూడదు.
- చలిగాలిలో స్నానంచేయించకూడదు.
- అత్యసవరంగా బయటకు తీసుకువెళ్లాలంటే తలకు, శరీరానికి నూలు వస్త్రాలు ధరింపజేయాలి.
- జలుబు, జ్వరం తగ్గకపోతే వెంటనే వైద్యుని సంప్రదించాలి. అల్ప ఉష్ణోగ్రతలు, పొగమంచుకు చిన్నారులను దూరంగా ఉంచాలి.

విటమిన్-సితో మేలు

మిగిలిన కాలాలతో పోలిస్తే చలికాలంలో కాస్త ఎక్కువ ఇబ్బందులు ఉంటాయి. శరీరం పొడిబారడంతో పాటు విసుగ్గా ఉంటుంది. ఈ కాలంలో సి విటమిన్ ఎక్కువగా లభించే పదార్థాలు తినాలి. నిమ్మ, బత్తాయి, కమలా పండ్లను తీసుకోవాలి. వీటిని తినడం వల్ల జలుబు చేస్తుందని అపోహ పడతారు. అటువంటి అపోహలు పెంచుకోకుండా వీలైనంత ఎక్కువగా తీసుకోవాలి. ఇవి రోగ నిరోధక శక్తిని పెంచి.. ఆరోగ్యంగా ఉండేందుకు దోహదపడతాయి.

ఇది వైరస్ కాలం



గత ఏడాది కంటే ఇప్పుడు చలి తీవ్రత ఎక్కువగా ఉంది. ఈ కాలంలోనే వైరస్ ప్రభావం ఎక్కువ. రక్తం సరఫరా తగ్గి, గుండె, ఊపిరితిత్తుల వ్యాధులకు దారితీస్తుంది. తగిన జాగ్రత్తలు తీసుకోకపోతే ప్రాణాంతకమే.

- పొన్నాడ గణేష్, సూపరింటెండెంట్, సామాజిక ఆసుపత్రి, కోటబొమ్మాళి

ఏజెన్సీలో మంచు దుప్పటి

మెళియాపుట్టి, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): గత నాలుగు రోజులుగా ఒక్కసారిగా వాతావరణంలో మార్పులు చోటుచేసుకున్నాయి. చలి పెరగడంతో పాటు మంచు ఎక్కువగా కురుస్తోంది. దీంతో ఉదయం, సాయంత్రం వేళల్లో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కొండలకు సమీపంలో ఉన్న గ్రామాల్లో..ఏజెన్సీలో మంచు ప్రభావం అధికంగా ఉంది. దీంతో ప్రజలు దగ్గు, జలుబుతో అవస్థలు పడుతున్నారు. ఉదయం వేళల్లో వాకింగ్‌కు వెళ్లేవారు మంచు కారణంగా ఇబ్బందులు పడుతున్నారు. రహదారులపై మంచు కారణంగా వాహనాలు సమీపంలోకి వచ్చే వరకు గుర్తించడానికి వీలు కుదరడం లేదు. దీని వల్ల రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇటీవల మంచు కారణంగా మండలంలోని ఓ పాఠశాల ఆటో ఢీకొని విద్యార్థులు గాయపడిన సంగతి తెలిసిందే.



మెళియాపుట్టిలో కురుస్తున్న మంచు

చట్ట విరుద్ధ కార్యకలాపాలపై నిఘా

- కాశీబుగ్గ డీఎస్పీ వెంకట అప్పారావు



డీఎస్పీ వెంకటఅప్పారావు

పలాస, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): చట్టవిరుద్ధమైన కార్యకలాపాలపై నిరంతరం సీసీ కెమెరాలతో నిఘా వేసినట్టు కాశీబుగ్గ డీఎస్పీ వి.వెంకట అప్పారావు తెలిపారు. వివిధ అంశాలపై శాఖాపరంగా చేపట్టిన చర్యలను ఆయన 'ఆంధ్రజ్యోతి'తో పంచుకున్నారు. ఆ వివరాలు..

ప్రశ్న: సోషల్ మీడియాలో వచ్చే అసభ్యకరమైన పోస్టులపై తీసుకుంటున్న చర్యలేంటి?

జవాబు: రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఇప్పటికే కఠినమైన చర్యలు తీసుకోవడానికి వెనుకాడడం లేదు. పోస్టులు పెట్టినప్పుడు అసభ్యకరమైనవా? కావా? అన్నది చూసుకోవలసి ఉంటుంది. వ్యక్తిగత ప్రతిష్ఠను దెబ్బతీసే ఏ పోస్టుకైనా తగిన మూల్యం చెల్లించుకోక తప్పదు.

ప్ర: బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగేవారిపై ఎటువంటి చర్యలు తీసుకుంటున్నారు?

జ: ఇప్పటికే నా పరిధిలో ఉన్న అన్ని పోలీసు స్టేషన్లకు ఆదేశాలు ఇచ్చాం. రోడ్లు, బహిరంగ స్థలాల్లో మద్యం తాగుతూ పట్టుబడితే తక్షణం చర్యలు తీసుకుంటున్నాం. అటువంటి వారిని అరెస్టు చేసి కోర్టులో హాజరుపరుస్తున్నాం. తప్పతాగి రోడ్లపై తందనాలు ఆడితే ఇక కుదరదు.

ప్ర: పశువుల అక్రమ రవాణా, ఈవ్‌టీజింగ్ నిరోధానికి ఏం చేస్తున్నారు?

జ: పశువులను అక్రమంగా తరలించడం నేరం. అటువంటి వారిపై నిరంతరం నిఘా పెట్టాం. జాతీయ రహదారి వెంబడి ప్రత్యేక పోలీసుల నిఘా ఉంటుంది. అనుమానం వస్తే తనిఖీలు చేసి అటువంటి పశువులను సంరక్షణ శాలకు తరలిస్తాం. పశు వైద్యాధికారుల అనుమతులు లేనిదే పశువుల రవాణా చేయడం నేరమని గుర్తించాలి. ఈవ్‌టీజింగ్‌పై ముఖ్య కూడళ్లలో నిఘా పెట్టాం. కళాశాలలు, పాఠశాలలు విడిచిపెట్టే సమయాల్లో మఫ్టీలో పోలీసులను ఉంచుతున్నాం. ఈవ్‌టీజింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు తప్పవు. ఈ వ్యవహారంలో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నాం.

ప్ర: నాటుసారా అరికట్టడానికి ఎటువంటి చర్యలు తీసుకుంటున్నారు?

జ: ఒడిశా సరిహద్దు ఉన్నందున ఈ ప్రాంతానికి నాటుసారా వస్తోంది. దీనిపై ఎక్సైజ్ శాఖతో కలిపి సంయుక్తంగా తనిఖీలు చేస్తున్నాం. అటువంటివి పట్టుబడితే వాహనాలు సీజ్ చేస్తాం. ఎక్కువసార్లు నేరాలకు పాల్పడిన వారిపై పీడీ కేసులు కూడా నమోదుకు సిఫారసు చేస్తున్నాం.

ప్ర: ట్రాఫిక్ నియంత్రణకు ఏం చేయబోతున్నారు?

జ: జంట పట్టణాల్లో ట్రాఫిక్ విపరీతంగా పెరుగుతున్న కారణంగా ఇప్పటికే మున్సిపల్ అధికారులతో సమావేశమయ్యాం. ఆటోల పార్కింగ్‌కు స్థలాలు కేటాయిస్తే కొంతవరకూ రోడ్డుపై వాహనాలను నిలపడం తగ్గుతుంది. కాశీబుగ్గ బస్టాండ్‌లో కూరగాయల మార్కెట్ వల్ల కూడా ట్రాఫిక్ సమస్యలు ఉన్నాయి. ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసి ట్రాఫిక్ ను క్రమబద్ధీకరిస్తాం. ఇచ్ఛాపురం, సోంపేటలో కూడా ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు తీసుకుంటున్నాం.

ప్ర: చట్ట విరుద్ధమైన కార్యకలాపాల నిరోధానికి తీసుకుంటున్న చర్యలేంటి?

జ: ముఖ్యకూడళ్లలో సీసీ కెమెరాలతో నిఘా పెట్టాం. పోలీస్టేషన్‌కు వచ్చిన ప్రతికేసును నమోదు చేసి రసీదు ఇవ్వడంతో పాటు వాటిని పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటున్నాం. కార్తీక మాసంలో పిక్నిక్‌లకు వెళ్లే వారు జాగ్రత్తలు పాటించాలి. పిక్నిక్ ప్రాంతాల్లో చట్ట వ్యతిరేక కార్యక్రమాలు నిర్వహిస్తే తక్షణం చర్యలు తీసుకుంటాం.

కొన్ని శాఖలపైనే..

(ఐదో పేజీ తరువాయి)

గత వైసీపీ ప్రభుత్వ హయాంలోనే మంచి జరిగిందని కీర్తించారు. జిల్లాపరిషత్ చైర్‌పర్సన్ పిరియా విజయ కూడా.. జగన్మోహనరెడ్డి హయాంలో అభివృద్ధి కార్యక్రమాలు జరిగాయని పేర్కొన్నారు. అలాగే పాఠశాలల్లో మధ్యాహ్న భోజనంలో పురుగులు ఉంటున్నాయంటూ ఆరోపించారు. రణస్థలం జడ్పీటీసీ టొంపల సీతారాం.. వైసీపీ హయాంలో జరిగిన కార్యక్రమాలను వల్లెవేస్తూ సభలో ప్రస్తావించారు. ఈ విషయంలో టీడీపీ జడ్పీటీసీ సభ్యుడు పొగిరి బుచ్చిబాబు అడ్డుతగిలి.. తన ప్రాంతం హిరమండలంలో ఒక్కసారి దర్యాప్తు చేపట్టాలన్నారు. నాడు-నేడు పనుల్లో భారీ అవినీతి జరిగిందని, అన్నీ నాసిరకం పనులే చేపట్టారని ధీటుగా బదులిచ్చారు. ఈ సమయంలో పరస్పర ప్రశ్నల వర్షం కురిపించారు.

ఇసుకకు డబ్బులు తీసుకుంటున్నారు..

ఉచిత ఇసుక అని ప్రభుత్వం అంటుంది. కానీ రీచ్‌ల వద్ద సీసీ కెమెరాలు లేవు. రూ.4వేలు ఇసుకకు రూ.7వేల నుంచి రూ. 10వేలు వసూలు చేస్తున్నారు. ఇప్పటివరకు అక్రమార్కులపై చర్యలు తీసుకున్నారా..? ఇసుక తరలిస్తున్న లారీలకు బిల్లులు ఉండటంలేదు. పల్లె ప్రాంతాల్లో ఆర్ఎంపీలపై రోగులకు ఉన్న నమ్మకం.. ప్రభుత్వ ఆస్పత్రులపై ఉండట్లేదు. ఆ నమ్మకాన్ని జిల్లా వైద్యఆరోగ్యశాఖ కల్పించాలి. గ్రామాల్లో ఉపాధి హామీ పనులు కొంత మందికే కల్పిస్తున్నారు. అలాగే ధాన్యం కొనుగోలు కేంద్రాలను తెరిచారా?. అసలు అవగాహన కల్పించారా?. ఎవరికీ ఈవిషయంపై అధికారులకు తట్టడంలేదు. దీనిపై చర్యలు తీసుకోవాలి.

- సిరిపురం జగన్మోహన్‌రావు, జడ్పీ వైస్‌చైర్మన్

ఇసుక సొమ్ము ఎవరికివెళ్తోంది

పోలాకి, నరసన్నపేట మండలాల్లో రాత్రిళ్లు ఇసుక తరలిపోతుంది. అందులో డబ్బులు ఏ నాయకుడికి వెళ్తున్నాయి. నియోజకవర్గానికా.. జిల్లాకా.. అంతకుమించి పై బాస్‌కా.. అసలు ఎవరు ఆ బాస్. ఒడిశా బిల్లులతో ఇసుకను తరలిస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో నరసన్నపేట సీహెచ్‌సీని అభివృద్ధి చేశాం. కానీ అసెంబ్లీలో నరసన్నపేట ఎమ్మెల్యే మాట్లాడుతూ సీహెచ్‌సీ అభివృద్ధి చేయలేదని ప్రస్తావించారు. అధికారులు దీనికి బదులివ్వాలి.

- ధర్మాన కృష్ణచైతన్య, పోలాకి జడ్పీటీసీ

రైతులు అయోమయంలో ఉన్నారు

జిల్లాలో రైతులు అయోమయంలో ఉన్నారు. ధాన్యం ఒక పార్టీవారే విక్రయించాలా.. అసలు ఎక్కడ కొనుగోలు చేస్తున్నారు.. ఇందుకు సంబంధించిన నిబంధనలు ఉన్నాయా? అసలు మిల్లర్లకు సరిగ్గా చెప్పగలరా?. తరుగు ఎంత తీస్తున్నారో తెలుస్తుందా మీకు.. సివిల్ సప్లయ్ అధికారులు ఇంతవరకు కొనుగోలు చేపట్టకపోవడం దారుణం.

- టొంపల సీతారాం, రణస్థలం జడ్పీటీసీ

15,287

(ఐదో పేజీ తరువాయి)

ముసాయిదా ఓటర్ల జాబితా

జిల్లా	పురుషులు	మహిళలు	మొత్తం ఓటర్లు
శ్రీకాకుళం	2,725	1,181	3,906
విజయనగరం	2,164	1,261	3,425
పార్వతీపురం మన్యం	1,267	595	1,862
విశాఖపట్నం	1,426	1,421	2,847
అనకాపల్లి	1,225	664	1,889
అల్లూరి	831	527	1,358
మొత్తం	9,638	5,647	15,287

అభ్యంతరాలను ఆన్‌లైన్‌లో అయితే 'సీఈవో ఆంధ్రా.ఎన్ఐసీ.ఇన్'కు లేదా ఆఫ్‌లైన్‌లో అయితే సంబంధిత ఓటరు నమోదు అధికారి, సహాయ నమోదు అధికారికి నిర్ణీత దరఖాస్తు ఫారంలో అందజేయాలని సూచించారు. ఇంకా కొత్తగా ఓటరుగా నమోదుకు లేదా ముసాయిదా ఓటర్ల జాబితాలో పేర్లు లేని ఉపాధ్యాయులు వచ్చే నెల తొమ్మిదో తేదీలోగా తమ దరఖాస్తులు అందజేయవచ్చునన్నారు. ఈనెల ఒకటో తేదీ నాటికి ఆరేళ్ల ముందు మాధ్యమిక పాఠశాలకు తక్కువకాని విద్యా సంస్థలో కనీసం మూడేళ్లపాటు బోధనానుభవం ఉండాలని, అందుకు సంబంధించిన ధ్రువీకరణపత్రం, ఇతర డాక్యుమెంట్లు అంటే నివాస ధ్రువపత్రం, పాస్ పోర్టు ఫొటో జతచేసి ఫారం-19 సమర్పించాలన్నారు. కాగా అభ్యంతరాలు పరిష్కరించి వచ్చే నెల 30న తుది ఓటర్ల జాబితా విడుదల చేస్తామని కలెక్టర్ పేర్కొన్నారు.

దళితవాడలో అగ్నిప్రమాదం


(ఐదో పేజీ తరువాయి)

నగదు కాలి బూడిదైందని ఆవేదన వ్యక్తం చేశారు.

- బాధితులను విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు(ఎన్ఈఆర్) తనయుడు తేజ పరామర్శించారు. అన్ని విధాలా ఆదుకుంటామని, ఇళ్ల మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. వారి వెంట నాయకులు బాలమ్మ వెంకటేశ్వరావు, కుమరాపు రవి కుమార్, వజ్జపర్తి రఘురాం, టంకాల మౌళీశ్వరరావు, డౌలూరి వెంకట రమణ, బెవర జగన్నాథరావు, కామోజుల సీతారాం, తహసీల్దార్ ఎం.శ్రీకాంత్ పాల్గొన్నారు.



ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న ఎంపీ కలిశెట్టి, ఎమ్మెల్యే తనయుడు తేజ



జగన్ గీసిన రామాయణ ఘట్టం

చిత్రలేఖనంలో గిరిజన యువకుడి ప్రతిభ

- జాతీయ స్థాయిలో ద్వితీయ స్థానం



బహుమతితో సవర జగన్


హరిపురం, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): మందస మండలం మారుమూల ఏజెన్సీ ప్రాంతంలోని గిరిజన యువకుడు.. జాతీయ స్థాయి చిత్రలేఖనం పోటీల్లో ప్రతిభ కనబరిచాడు. హైదరాబాద్‌కు చెందిన కాసుల చిత్రకళ ఆర్ట్ అకాడమి ఆధ్వర్యంలో గత ఆగస్టులో ఆన్‌లైన్‌లో రామాయణం వంటి అంశాలపై చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు ఈ పోటీల్లో చీపి పంచాయితీ బొందికారికి చెందిన సవర జగన్ ద్వితీయ స్థానంలో నిలిచాడు. అకాడమీ చైర్మన్ కాసుల పద్మావతి చేతులమీదుగా బహుమతి అందుకున్నాడు. మందస మండల ఆదివాసీ వికాస పరిషత్తు అధ్యక్షునిగా సేవలందిస్తున్న జగన్‌ను వివిధ వర్గాల వారు అభినందిస్తున్నారు.

చివరి ప్రయత్నం!



సైకిల్‌పై మోటారును తీసుకెళ్తున్న రైతు





అడవి పందుల బెడద నుంచి రక్షణకు తీగలు, జెండా కొయ్యలు ఏర్పాటు చేసిన రైతులు

పలాస రూరల్/సోంపేట, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): పలాస, సోంపేట ప్రాంతాల్లో అత్యధిక శాతం వర్షాధారంగా వరిని సాగు చేస్తున్నారు. మొదట్లో వర్షాలు కురవడంతో వరి పంట వేశారు. కీలకమైన ఈ దశలో నీరు అవసరం. కానీ నెల రోజులుగా వర్షాలు కురవకపోవడంతో పంట ఎండిపోయే పరిస్థితి తలెత్తింది. ఇలాంటి సమయంలో మోటార్లతో నీరు పెట్టి.. పంట పొలాలను రక్షించుకునేందుకు రైతులు ప్రయత్నిస్తున్నారు. మోటార్లు వేసుకుంటే ఖర్చులు తడిసి మోపెడు అవుతున్నాయని వాపోతున్నారు. పలాస మండలం రెంటికోట, కైజోల, కాంట్రగడ, లొత్తూరులోని మెట్టు ప్రాంతాల్లో వరి పంటకు నీరు అందించేందుకు రైతులు ఆపసోపాలు పడుతున్నారు. లొత్తూరు, కాంట్రగడ ప్రాంతాల్లో మరో వారం రోజుల్లో పంట కోతకు వస్తోంది. ఈ సమయంలో అడవి పందులతో పంట నాశనమవుతుండడంతో చుట్టూ తీగలు కట్టడం, సిమెంట్ కవర్లతో కొయ్యలు పాతడం ద్వారా కాపాడుకునే ప్రయత్నం చేస్తున్నారు. మరో వైపు రెంటికోట కాలనీ, కాంట్రగడ కాలనీల్లో నీరు లేకపోవడంతో గెడ్డల్లో ఉన్న నీటిని పైకి లాగి పంట పొలాలకు తరలించేందుకు మోటార్లను అద్దెకు తీసుకు వస్తున్నారు.



బారువ వద్ద ఇంజన్లతో నీటిని తోడుతున్న దృశ్యం

మహిళ మెడలోని పుస్తెలతాడు చోరీ

కంచిలి, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): కవిటి మండలం ప్రగడపుట్టుగ గ్రామానికి చెందిన మానస పురియా అనే మహిళ మెడలోని రెండు తులాల పుస్తెలతాడును తెంచుకొని దుండగుడు పరారయ్యాడు. కంచిలి పోలీసుల వివరాల మేరకు.. మానస తన తల్లి, కుమారుడితో కలసి శనివారం మధ్యాహ్నం సోంపేట నుంచి స్కూటీపై తన కన్నవారి గ్రామం వరక వెళ్తుంది. కంచిలి మండలం కొన్నాయిపుట్టుగ పంచాయతీ సూదిపుట్టుగ వద్ద గుర్తు తెలియని వ్యక్తి వెనుక నుంచి ద్విచక్ర వాహనంపై వచ్చి మానస మెడలోని పుస్తెలతాడును తెంచుకొని పరారయ్యాడు. వెంటనే స్థానికులు గాలించినప్పటికీ దొంగ దొరకలేదు. బాధితురాలి ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ పి.పారినాయుడు కేసు నమోదు చేశారు.

33 మద్యం సీసాల స్వాధీనం

లావేరు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): బుడుమూరు సంత జంక్షన్ నుంచి రేగపాలెంకు చెందిన సాడి రమణ 30 మద్యం సీసాలు తరలిస్తుండగా శనివారం రాత్రి పోలీసులు పట్టుకున్నారు. రమణపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ లక్ష్మణరావు తెలిపారు.

8 మంది పేకాటరాయుళ్ల అరెస్టు

ఎచ్చెర్ల, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పాతదిబ్బలపాలెంలో శనివారం రాత్రి పేకాట ఆడుతున్న 8 మందిని అరెస్టు చేసినట్లు సందీప్‌కుమార్ తెలిపారు. వారినుంచి రూ.74వేల నగదు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.

‘అపార్’ సమస్యలను పరిష్కరించాలి

అరసవల్లి, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): అపార్ నమోదులో తలెత్తుతున్న సమస్యల పరిష్కారానికి అధికారులు చర్యలు చేపట్టాలని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు గొండు సీతారాం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలో సరిపడినంత ఆధార్ కేంద్రాలు అందుబాటులో లేకపోవడంతో నిత్యం ఫిర్యాదులు వస్తున్నాయని తెలిపారు. విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు వేగవంతమైన చర్యలు తీసుకోవాలని కోరారు.

ఓటర్ల ముసాయిదా ప్రచురణ

ఇచ్ఛాపురం, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో ఇప్పటి వరకు కొత్తగా 410మంది ఉపాధ్యాయులు ఓటు హక్కు కోసం నమోదు చేసుకున్నట్లు ఇన్‌చార్జి తహసీల్దార్ శ్రీహరి తెలిపారు. ఈ మేరకు శనివారం మున్సిపాల్టీ, మండలాల పరిధిలోని అన్ని పోలింగ్ కేంద్రాల వద్ద ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ముసాయిదా ఓటర్ల జాబితాను ప్రచురించారు. జాబితాలో ఎటువంటి అభ్యంతరాలు ఉన్నా డిసెంబరు 9లోపు సంబంధిత తహసీల్దార్లకు తెలియజేయాలని అన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తం

ఇచ్ఛాపురం, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): యువత సైబర నేరాలపై అప్రమత్తంగా ఉండాలని ఇచ్ఛాపురం మున్సిఫ్ మెజిస్ట్రేట్ కోర్టు న్యాయవాదులు సీతయ్యరెడ్డి, కృష్ణమూర్తిరెడ్డి, రాంబాబు అన్నారు. శనివారం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యార్థులు సోషల్ మీడియాకు దూరంగా ఉండాలని, అనవసరమైన లింక్‌లను ఓపెన్ చేయవద్దని సూచించారు. గంజాయి వంటి మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రోబిన్‌కుమార్ పాడి, అధ్యాపకులు సంతోష్‌కుమార్, దుర్యోధన, శ్రీనివాసరావు, శివకుమార్, దేవరాజ్, ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలి

ఇచ్ఛాపురం, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): ప్రతిఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ రోబిన్ కుమార్ పాడి అన్నారు. శనివారం కళాశాలలో వృక్షశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో వాతావరణంలో మార్పులు.. మొక్కలపై ప్రభావం అంశంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో బారువా ప్రభుత్వ డిగ్రీ కళాశాల వృక్షశాస్త్ర అధ్యాపకురాలు వి.స్నేహలత తదితరులు పాల్గొన్నారు.

అంతర్ వర్సిటీ పోటీలకు క్రీడాకారుల ఎంపిక

ఎచ్చెర్ల, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): అంతర్ వర్సిటీ స్థాయి క్రీడా పోటీలకు అంబేడ్కర్ యూనివర్సిటీ తరఫున క్రీడాకారులు ఎంపికయ్యారు. ఈ నెల 26 నుంచి 28 వరకు విశ్వేశ్వరయ్య సాంకేతిక విశ్వ విద్యాలయం (బెల్గాం, కర్ణాటక)లో జరిగే బ్యాడ్మింటన్ పోటీలకు ఎల్.పార్వతి, వై.హేమ, కె.నాగమణి, ఎం.అశ్విని, శెట్టి లిల్లీ, ఆచార్య నాగార్జున యూనివర్సిటీ (గుంటూరు)లో జరిగే సౌత్ వెస్ట్ వెయిట్ లిఫ్టింగ్ పోటీలకు డి.హేమశ్రీ, జి.వర్షిత, ఎస్.ఝాన్సీరాణి ఎంపికయ్యారు. క్రీడాకారులను వర్సిటీ వీసీ ప్రొఫెసర్ కేఆర్ రజని, రిజిస్ట్రార్ పి.సుజాత, వర్సిటీ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.అనూరాధ, స్పోర్ట్స్ డీన్ పి.రవికుమార్, పీడీ ఎం.శ్రీనివాసరావు శనివారం అభినందించారు.

నాగచైతన్య అభిమానుల రక్తదానం



రక్తదానం చేస్తున్న అభిమానులు

శ్రీకాకుళం అర్బన్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): నగరంలోని విజయశ్రీ బ్లడ్ బ్యాంకులో హీరో అక్కినేని నాగచైతన్య పుట్టిన రోజు వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన అభిమానులు రక్తదానం చేశారు. కార్యక్రమంలో అభిమానులు గురుచరణ్, పొట్నూరు సంతోష్, అశోక్, ఉపేంద్ర, హరి, యశ్వంత్ తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికతోనే మానసిక ప్రశాంతత

అరసవల్లి, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత కలుగుతుందని శ్రీకాకుళం నియోజకవర్గ తెలుగు మహిళా అధ్యక్షురాలు గొండు స్వాతి శంకర్ అన్నారు. నియోజకవర్గంలోని పలు సత్యసాయి మందిరాల్లో, పడి పూజా కార్యక్రమాల్లో ఆమె శనివారం పాల్గొన్నారు. సత్యసాయిబాబా సమస్త మానవాళికి ఆధ్యాత్మిక విలువలు అందజేశారని అన్నారు. ఈ కార్యక్రమంలో సత్యసాయి భక్తులు పాల్గొన్నారు.

కేసుల దర్యాప్తు పూర్తి చేయాలి: ఎస్పీ

ఎచ్చెర్ల/లావేరు/శ్రీకాకుళం క్రైం, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): పెండింగ్ కేసుల దర్యాప్తును త్వరిత గతిన పూర్తిచేయాలని ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి ఆదేశించారు. శనివారం రాత్రి ఎచ్చెర్ల, లావేరు, శ్రీకాకుళం ట్రాఫిక్, మహిళ పోలీసు స్టేషన్లను ఆయన సందర్శించారు. ముఖ్యమైన రికార్డులను పరిశీలించారు. రికార్డుల నిర్వహణపై అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం విజిబుల్ పోలీసింగ్ నిర్వహించాలని, సంకల్పం కార్యక్ర మం పేరిట మాదక ద్రవ్యాలతో కలిగే దుష్ప్రభావాలను ప్రజలకు వివరించా లని సూచించారు. రోడ్డు ప్రమాదాల నివారణ, భద్రతా నియమాలపై తీసుకోవాల్సిన చర్యలు గురించి పోలీసులకు వివరించారు. కార్యక్రమంలో డీఎస్పీ బి.రాజశేఖర్, సీఐలు అవతారం, నాగరాజు, త్రినేత్రి, ఎస్‌ఐలు సందీప్‌కుమార్, లక్ష్మణరావు, లక్ష్మి, చంద్రకళ పాల్గొన్నారు.

మత్తుపదార్థాలకు దూరంగా ఉండండి

ఆమదాలవలస, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): మత్తు పదార్థాలకు ప్రజలు దూరంగా ఉండాలని ప్రొహిబిషన్, ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ జి.సతీష్ కుమార్ అన్నారు. బూర్జ మండలం జంగాలపాడు గ్రామంలో శనివారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. మత్తు పదార్థాలతో కలిగే అనర్థాలపై వివరించారు. సారా ఎవరైనా తయారు చేస్తే సమాచారం ఇవ్వాలని, వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు.

ట్యాంకు ఇలా.. తాగు నీరు ఎలా?

గార, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ఏర్పాటు చేసిన తాగునీటి ట్యాంకులు చాలా చోట్ల నిర్వహణకు నోచుకోవడం లేదు. ట్యాంకుల చుట్టూ పిచ్చి మొక్కలు పెరిగిపోవడంతో వృథా నీరు నిలిచిపోతుంది. దీనివల్ల ఆ ప్రాంతం మురికి కూపంగా మారుతుంది. శ్రీకూర్మం పంచాయతీ తండ్యాలపేట సమీపంలోని గొలివిపేట వద్ద ఉన్న శాలిహుండం మంచినీటి ట్యాంకు చుట్టూ అపరిశుభ్రత నెలకొంది. గ్రామస్థుల తాగునీటి అవసరాల కోసం రెండు దశాబ్దాల కిందట ఈ ట్యాంకును నిర్మించారు. అయితే, ట్యాంకు కంటే రోడ్డు ఎత్తుగా ఉండడంతో వృథా నీరు బయటకు వెళ్లేమార్గం లేక అక్కడే నిలిచిపోతుంది. అలాగే, ఆ ప్రాంతం పిచ్చి మొక్కలతో నిండిపోయింది. ఫలితంగా స్థానికులు మంచినీరు పట్టుకోవడానికి ఇబ్బంది పడుతున్నాను. అధికారులు స్పందించి ట్యాంక్ వద్ద బాగుచేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.



గొలివిపేట వద్ద మంచినీటి ట్యాంక్ చుట్టూ పిచ్చి మొక్కలు

బిడ్డను ఆడిస్తూ.. సమస్యలను లేవనెత్తుతూ..



ఈమె పేరు దార అప్పలనరసమ్మ. విజయనగరం జిల్లా రేగిడి మండల పరిషత్ అధ్యక్షురాలు. శనివారం శ్రీకాకుళంలో జరిగిన జడ్పీ సమావేశానికి తన చంటి బిడ్డతో హాజరైంది. ఒకపక్క తన బిడ్డను ఆడిస్తూనే, మరోపక్క మండలంలోని పలు సమస్యలను లేవనెత్తారు. మండలంలో ఓ పంచాయతీ కార్యదర్శి అవినీతికి పాల్పడి నిధులు కాజేశారని.. దీనిపై చర్యలు తీసుకోవాలని సభలో కోరారు.

-శ్రీకాకుళం (ఆంధ్రజ్యోతి)

కొన్ని గ్రామాలకే పనులు చేస్తారా?

- ప్రశ్నించిన ఎంపీటీసీ సభ్యులు
- ఎచ్చెర్ల సర్వసభ్య సమావేశం రసాభాస

రణస్థలం, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఎచ్చెర్ల మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఎంపీపీ మొదలవలస చిరంజీవి అధ్యక్షతన నిర్వహించిన సమావేశం రసాభాసగా మారింది. సమావేశం ప్రారంభం కాగానే అజెండాలోని ఇతర అంశాలపై చర్చ జరగాలని కుప్పిలి, కొంగరాం, బొంతలకోడూరు, జరజాం ఎంపీటీసీ సభ్యులు బల్లాడ జనార్ధనరెడ్డి, జరుగుళ్ల విజయకుమారి, మాడుగుల జగదీశ్వరరావు, సీరపు శ్రీరామ్మూర్తి పట్టుబట్టారు. సభ్యుల అనుమతి లేకుండా మండల పరిషత్ నిధులు, 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.99 లక్షలతో పనులను కొన్ని గ్రామాలకే పరిమితం చేయడంపై వారు వాదనకు దిగారు. సభను వాయిదా వేసినప్పటికీ వారు మాత్రం నిరసన కొనసాగించారు. దీంతో ఆ నలుగురి సభ్యులను నాలుగు నెలల పాటు సస్పెండ్ చేస్తున్నట్టు ఎంపీడీవో హరిహరరావు నోటీసులు అందజేశారు. వారిని బయటకు పంపాలని పోలీసులను ఎంపీడీవో కోరినప్పటికీ, తాము జోక్యం చేసుకోలేమని వారు నిరాకరించారు. అధికారులు చాలా మంది లేకపోవడంతో శాఖాపరమైన చర్చలేకుండానే సమావేశాన్ని ముగించారు.



సర్వసభ్య సమావేశంలో వాదోపవాదాలు జరుగుతున్న దృశ్యం

అవినీతి అదానీని అరెస్టు చేయాలి

- కాంగ్రెస్ నాయకుల డిమాండ్
- శ్రీకాకుళం నగరంలో ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న కాంగ్రెస్ నాయకులు

అరసవల్లి, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): సౌర విద్యుత్తు కొనుగోలు ఒప్పందాలకు సంబంధించి అవినీతికి పాల్పడిన పారిశ్రామికవేత్త గౌతమ్ అదానీని అరెస్టు చేయాలని యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు లక్కరాజు రామారావు డిమాండ్ చేశారు. నగరంలోని పార్టీ కార్యాలయంలో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో జాతీయ కార్యదర్శి, ఏపీ ఇన్‌చార్జి మమతా నాగిరెడ్డితో కలసి ఆయన మాట్లాడారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను ఆపకుంటే ప్రధానమంత్రి నరేంద్రమోదీ రాష్ట్ర పర్యటనను అడ్డుకుంటామని అన్నారు. ఈ సందర్భంగా యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడిగా పూడి కిరణ్‌కుమార్‌కు నియామకపత్రాన్ని అందజేశారు. ముందుగా పార్టీ కార్యాలయం నుంచి అరసవల్లి మిల్లు జంక్షన్ వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు అంబటి కృష్ణారావు, నాయకులు గాదం వెంకట త్రినాథరావు, రెల్ల సురేష్, వెంకన్ననాయుడు, మజ్జి త్రినాథరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రతిఒక్కరూ సూర్యుడికి నమస్కరించాలి

శ్రీకాకుళం కల్చరల్, నవంబర్ 23 (ఆంధ్రజ్యోతి): ప్రతిఒక్కరూ ఉదయాన్నే సూర్యుడికి నమస్కరించాలని, దీన్ని పిల్లలకు కూడా నేర్పించాలని ప్రముఖ ఆధ్యాత్మిక వేత్త సామవేదం షణ్ముఖశర్మ అన్నారు. ఉపనిషన్మందిరం, సుమిత్రా కళాసమితి ఆధ్వర్యంలో శనివారం బాపూజీ కళామందిర్‌లో షణ్ముఖ శర్మచే సూర్యదర్శనమ్ పేరిట ప్రవచన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. అనంతవిశ్వంలో చైతన్య హేతువు సూర్యుడేనని, అలాంటి సూర్యనారాయణ స్వామి ఆలయం అరసవల్లిలో ఉండడం మన తెలుగువారు చేసుకున్న పుణ్యమని అన్నారు. కార్యక్రమంలో ఇప్పిలి శంకర్ శర్మ, గుమ్మా నగేష్, పులకండం శ్రీనివాసరావు, సురంగి మోహనరావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న షణ్ముఖ శర్మ

వైద్య విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దడమే లక్ష్యం

శ్రీకాకుళం రూరల్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): వైద్య విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దడమే లక్ష్యమని జెమ్స్ కాలేజ్ చీఫ్ మెంటర్ డాక్టర్ బొల్లినేని భాస్కరరావు అన్నారు. శనివారం జెమ్స్ కళాశాలలో మొదటి సంవత్సరం వైద్యవిద్యార్థుల వైట్ కోట్‌శర్మని వైభవంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆయన హాజరై మాట్లాడారు. సమాజ సేవే లక్ష్యంగా విద్యార్థులు ఉన్నత వైద్యులుగా ఎదగాలని ఆకాంక్షించారు కళాశాల ప్రిన్సిపాల్ డా.లక్ష్మీలలిత మాట్లాడుతూ.. ఎంబీబీఎస్ సెలక్షన్స్‌లో జెమ్స్ కళాశాలను కోరి ఎంచుకోవడం తమకెంతో గర్వకారణమని తెలిపారు. అనంతరం మెడికల్ సూపరింటెండెంట్ డా.అశోక్ రెడ్డి, హిప్పోక్రటిక్ ఓత్, అడిషనల్ మెడికల్ సూపరింటెండెంట్ డా.శ్రీనివాసులు విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. డా.సుధీర్, చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ రామ్మోహన్, డిప్యూటీ మెడికల్ సూపరింటెండెంట్ డా.హేమంత్ పాల్గొన్నారు.



బొల్లినేని భాస్కరరావును సత్కరిస్తున్న దృశ్యం

కక్ష సాధింపునకే నాపై కేసు

- జగన్‌ను తిట్టిన పవన్‌పై కూడా పెట్టండి
- ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్

శ్రీకాకుళం అర్బన్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌పై రెండేళ్ల కిందట తాను చేసిన వ్యాఖ్యలకు, ఇప్పుడు తనపై కేసులు పెట్టడం ఏంటని, ఇది కక్షసాధింపు రాజకీయాలేనని ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ అన్నారు. నగరంలోని ఓ హోటల్‌లో శనివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు ముఖ్యమంత్రి జగన్‌తో పాటు మంత్రులను పవన్ నోటికి వచ్చినట్టు తిట్టారని, ఆయనపై కూడా కేసు పెట్టాలని డిమాండ్ చేశారు. జనసేన నాయకుడు పేడాడ రామ్మోహన్ తనపై అనుచిత వ్యాఖ్యలు చేశారని, అతనిపై కూడా కేసు పెట్టాలని కోరారు. కేసులు, అరెస్టులకు తాను జడిసేది లేదని, ప్రజాక్షేత్రంలో పోరాటానికి ఎప్పుడూ సిద్ధమేనని దువ్వాడ అన్నారు.

ధాన్యం కొనుగోలులో ఇబ్బందులు ఉండకూడదు

జి.సిగడాం, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోలులో రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని శ్రీకాకుళం ఆర్డీవో సాయి ప్రత్యూష అన్నారు. పెంట గ్రామంలో రైతులు నూర్పు చేసిన ధాన్యం ఆమె శనివారం పరిశీలించారు. ధాన్యం కొనుగోలులో అలసత్వం వహిస్తే సహించేది లేదని హెచ్చరించారు. ఆమె వెంట తహసీల్దార్ ఎం.శ్రీకాంత్, వీఆర్వో భూపతి నర్సింగరావు, వీఏఏలు అలుగోలు లక్ష్మీనారాయణ, ముంతా హేమంత్, సింహాద్రి హరికృష్ణ, ముంతా హరీష్ ఉన్నారు.

ఆర్డీవో దృష్టికి రెవెన్యూ సమస్యలు

మండలంలోని రెవెన్యూ సమస్యలను టీడీపీ మండల అధ్యక్షుడు కుమరాపు రవికుమార్ ఆర్డీవో సాయి ప్రత్యూష దృష్టికి తీసుకువెళ్లారు. మదుపాం మేజర్ పంచాయతీలో ఉండాల్సిన రేషన్‌డీవో నెంబర్-7 ను నల్లిపేటలో నిర్వహిస్తున్నారని, ఆడిపోను మదుపాంలో నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

రాష్ట్రస్థాయి పోటీలకు జిల్లా విద్యార్థినులు

గుజరాతీపేట, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): గత నెలలో దేశ వ్యాప్తంగా నిర్వహించిన విద్యార్థి విజ్ఞాన్ మంథన్ ప్రతిభా పరీక్షలో జిల్లాకు చెందిన నలుగురు విద్యార్థినులు వి.హరిణి, బి.నవీన, సీఎల్ఎస్.వైష్ణవి, జామి వేదశ్రీ సత్తాచాటారు. వీరు డిసెంబరు 15న రాజమండ్రిలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీలకు హాజరవుతారని డీఈవో తిరుమల చైతన్య తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఆయన అభినందించారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

పొందూరు, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): మద్యం వ్యాపారులు నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని ఎక్సైజ్ శాఖ శ్రీకాకుళం డిప్యూటీ కమిషనర్ శ్రీకాంత్‌రెడ్డి హెచ్చరించారు. పొందూరు ఎక్సైజ్ స్టేషన్‌ను శనివారం ఆయన సందర్శించారు. బెల్టు దుకాణాలపై దాడులు నిర్వహించి కేసులు నమోదు చేయాలని సీఐ రాజును ఆదేశించారు.

ఆనందాశ్రమాన్ని సందర్శించిన ఎంపీ

పొందూరు, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని కృష్ణాపురం ఆనందాశ్రమాన్ని శనివారం విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు సందర్శించారు. ఆశ్రమంలో ఆదివారం హిందూధార్మిక సహాసభ జరగనుంది. ఈ సభకు దేశం నలుమూలల నుంచి సుమారు 60 మంది పీఠాధిపతులు, చుటుపక్కల గ్రామాల నుంచి వేలాదిమంది భక్తులు హాజరుకానున్నారు. దీనికి సంబంధించిన ఏర్పాట్లను ఆనందాశ్రమ పీఠాధిపతి, రాష్ట్ర సాధుపరిషత్ అధ్యక్షుడు స్వామి శ్రీనివాసానంద.. ఎంపీకి వివరించారు.

ఘనంగా భారత రాజ్యాంగ దినోత్సవం

గుజరాతీపేట, నవంబర్ 22 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శనివారం భారత రాజ్యాంగ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాస్థాయిలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించారు. విజేతలకు డీఈవో తిరుమల చైతన్య బహుమతులు అందజేశారు.


ఎక్కువ కేసులు పరిష్కరించాలి

గుజరాతీపేట, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు పరిష్కరించాలని జిల్లా ప్రధాన న్యాయాదికారి జునైద్ అహ్మద్ మౌలానా అన్నారు. శనివారం జిల్లా కోర్టు భవనంలో జిల్లాలోని న్యాయాధికారులతో వర్చువల్ సమావేశం నిర్వహించారు. డిసెంబర్ 14న జరగనున్న అదాలత్‌లో ఎక్కువ కేసులు రాజీ అయ్యేలా చూడాలన్నారు. కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసి నాయుడు, న్యాయవాదులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

చోరీ సొత్తు 48 గంటల్లో రికవరీ

● నిందితుడు పర్లాకిమిడి వాసి



స్వాధీనం చేసుకున్న వెండి వస్తువులను చూపిస్తున్న సీఐ, ఎస్‌ఐ

పోలాకి, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): పోలాకి సత్యసాయి మందిరంలో జరిగిన చోరీకి సంబంధించి కేసును ఛేదించి నిందితులను 48 గంటల్లో పట్టుకుని చోరీ సొత్తు స్వాధీనం చేసుకున్నట్లు నరసన్నపేట సీఐ జె.శ్రీనివాసరావు తెలిపారు. ఈ మేరకు శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. కేసు వివరాలను తెలిపారు. సత్యసాయి మందిరంలో గురువారం చోరీ జరిగి సాయిబాబా కిరీటం, ఉద్ధరిణ, పంచపాత్ర, పళ్లెం వంటి వెండి వస్తువులు అపహరించారని, దీనిపై మందిరం కన్వీనర్ బరాటం రామారావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ రంజిత్ ఆధ్వర్యంలో ఆరా తీసి జమ్ము జంక్షన్ వద్ద చాకచక్యంగా నిందితుడిని పట్టుకున్నామన్నారు. నిందితుడు ఒడిశా రాష్ట్రం పర్లాకిమిడి జంగంవీధికి చెందిన పోలుమహంతి ప్రసాదరావుగా గుర్తించామన్నారు. అతడి వద్ద నుంచి సుమారు అరకిలో వెండి వస్తువులను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిందితుడు గతంలో సంతబొమ్మాళి మండలంలో పలు దొంగతనాలకు పాల్పడిన కేసుల్లోనూ ఉన్నాడన్నారు. నిందితుడిని అరెస్టుచేసి రిమాండ్‌కు పంపినట్లు తెలిపారు. సమావేశంలో ఎస్‌ఐ రంజిత్, సిబ్బంది పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి



సోమేశ్వరరావు (ఫైల్)

మెళియాపుట్టి, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): శిరియాఖండి పంచాయతీ దుర్బలాపురం గ్రామానికి చెందిన కోటిలింగాల సోమేశ్వరరావు (28) అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. సోమేశ్వరరావు పలాసలో ఒక ప్రైవేటు సంస్థలో పనిచేస్తున్నాడు. ప్రతిరోజూ గ్రామం నుంచి ద్విచక్ర వాహనంపై పలాస వెళుతుంటాడు. గురువారం తన కుమారుడు ఇంటికి రాకపోవడం, ఫోన్ కూడా పనిచేయక పోవడంతో తండ్రి మల్లేశ్వర రావు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అయితే శనివారం మెళియాపుట్టి- పలాస మార్గంలో జాడుపల్లి-పట్టుపురం సమీపం లో రోడ్డు పక్కన ఆఫ్‌షోర్ కాలువ పొదల్లో దుర్వాసన రావడంతో స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో ఎస్‌ఐ రమేష్ బాబు ఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. మిస్సింగ్ కేసు నమోదు కావడంతో సోమేశ్వరావు కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. తండ్రి వచ్చి పరిశీలించి తమ కూమారుడేనని నిర్ధారించారు. పోలీసులు మాత్రం రోడ్డు ప్రమా దంగా భావిస్తుండగా కుటుంబ సభ్యులు మాత్రం అతడి మృతిపై అను మా నాలు వ్యక్తం చేస్తున్నారు. ప్రమాదం జరిగితే రోడ్డ పక్కన మృతదేహం పడి ఉండాలి కాని పొదల్లో ఉండడంతో అను మానాలు వ్యక్తమవుతున్నాయి. హెల్మెట్ కూడా ధరించి ఉండడం కనిపించిందని, దీనిపై అనుమానాలున్నాయని కుటుంబ సభ్యులు పేర్కొంటున్నారు. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రమేష్‌బాబు తెలిపారు.

చైన్ స్నాచర్ హల్‌చల్

● త్రుటిలో తప్పించుకున్న మహిళ

పలాస, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): పలాస-కాశీబుగ్గ జంట పట్టణంలో చైన్ స్నాచర్లు హల్‌చల్ చేశారు. శనివారం సాయంత్రం రోటరీ నగర్‌లో ఓ మహిళ మెడలో బంగారు ఆభరణాలు తస్కరించేందుకు విఫలయత్నం చేశారు. అయితే ఆమె ప్రతిఘటించడంతో ఇద్దరు చైన్ స్నాచర్లు పరారీ అయ్యారు. బైక్‌పై వచ్చిన ఇద్దరు ఆగంతకులు అక్కడున్న కిరాణా షాపులో సిగిరెట్ కొనుగోలు చేసేందుకు వెళ్లి షాపులో ఉన్న మహిళ మెడలో పుస్తెలతాడు తస్కరించేందుకు యత్నించారు. ఇరువురి మధ్య పెనుగులాట జరగడంతో పుస్తెలతాడు తెగి కింద పడిపోయింది. దీంతో ఆ మహిళ తేరుకొని కేకలు వేయడంతో ఇద్దరు బైక్‌పై అక్కడి నుంచి ఉడాయించారు. విషయం తెలుసుకున్న కాశీబుగ్గ సీఐ డి.మోహనరావు ఘటనా స్థలానికి చేరుకొని మహిళ నుంచి వివరాలు తెలుసుకున్నారు. ఆమె ఫిర్యాదు చేయడంతో చైన్‌స్నాచర్ల కోసం గాలిస్తున్నట్లు ఆయన తెలిపారు.

ఏడు ఇసుక లారీలు సీజ్



ఆమదాలవలస, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నాగావళి నది నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ఏడు లారీలను సీజ్ చేసినట్టు ఎస్‌ఐ కె.వెంకటేష్ తెలిపారు. వీటిని శుక్రవారం రాత్రి కొత్తరోడ్డు సమీపంలో పట్టుకుని ఆమదాలవలస పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు చెప్పారు.

పశువుల అక్రమ రవాణా: ఇద్దరిపై కేసు

ఆమదాలవలస, నవంబర్ 23 (ఆంధ్రజ్యోతి): పశువులను అక్రమంగా రవాణా చేస్తున్న ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ ఎ.సింహాచలం తెలిపారు. మున్సిపాల్టీలోని ఏడో వార్డు చింతాడ సంత నుంచి పాలకొండ వైపు వస్తున్న మినీ వ్యాన్‌ను ఆమదాలవలస బ్రిడ్జి వద్ద పోలీసులు తనిఖీ చేశారు. వ్యాన్‌లో అక్రమం గా తరలిస్తున్న 11 పశువులను స్వాధీనం చేసుకుని చింతాడ గ్రామానికి చెందిన బోర వెంకటసూర్యనారాయణ, బూర్జ మండలం ఏబీసీపేట గ్రామానికి చెందిన గరుగుబిల్లి రాముపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

మడపాం టోల్‌ప్లాజా వద్ద..

నరసన్నపేట, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మడపాం టోల్‌ప్లాజ్ వద్ద శనివారం తెల్లవారుజామున అక్రమంగా తరలిస్తున్న 20 పశువులను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ దుర్గాప్రసాద్ తెలిపారు. నారాయణవలస సంత నుంచి 20 పశువులను వాహనంలో తరలిస్తుండగా దాడి చేసి పట్టుకుని డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. స్వాధీనం చేసుకున్న పశువులను సంరక్షణ కేంద్రానికి తరలించామన్నారు.

ఆటో బోల్తా: ఇద్దరికి గాయాలు

జలుమూరు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): లింగాలవలస పెట్రోల్ బంకు సమీపంలో శనివారం ఆటో బోల్తా పడి ఇద్దరికి గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. నరసన్నపేట నుంచి అలుదు గ్రామానికి ప్రయాణికులతో వెళుతున్న ఆటో బంకు వద్ద ఎదురుగా వస్తున్న మరో వాహనాన్ని తప్పించబోయి పొలంలోకి దూసుకుపోయి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో జిల్లేడు మాకివలసకి చెందిన ప్రయాణికురాలు దాసరి నరసమ్మకు, సుందరాపురానికి చెందిన ఆటో డ్రైవర్ కె.నీలకంఠానికి గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108 వాహనంలో నరసన్నపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. నరసమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ అశోక్‌బాబు తెలిపారు.

20 అడుగుల కొండ చిలువ పట్టివేత



మెళియాపుట్టి, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కరజాడ గ్రామ సమీపంలో శనివారం సుమారు 20 అడుగుల కొండచిలువ కనిపించింది. రైతులు వరి కోతలకు వెళుతుండగా కొండచిలువ తారసపడింది. ఇది నక్కను తింటుండడంతో కదల లేని స్థితిలో ఉండడంతో రైతులు ఆందోళన చెందారు. వెంటనే అటవీ శాఖాధికారులతో పాటు పలాసకు చెందిన ఈస్ట్రన్ గాడ్స్ వైల్డ్‌లైఫ్ సభ్యుడు ఓంకార్‌కు సమాచారం ఇచ్చారు. వెంటనే ఆయన సదరు కొండచిలువను పట్టుకుని సమీపంలోని అడవిలో విడిచిపెట్టారు. ఇటీవల పెద్దమడి గురు కుల పాఠ శాలలో కూడా కింగ్ కోబ్రాను పట్టుకున్న సంగతి తెలిసిందే. ఎక్కడైనా పాములు కనిపిస్తే సమాచారం ఇవ్వాలని ఓంకార్ తెలిపారు.

ఘనంగా సత్యసాయి జయంతి

● సేవా కార్యక్రమాలు, ప్రత్యేక పూజలు,
● గ్రామ సంకీర్తన, భజనలతో సందడి
● వైభవంగా సాయి వ్రతాలు

సత్యసాయిబాబా జయంతి వేడుకలు జిల్లాలో వాడవాడలో శనివారం ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజాము నుంచి నగర, గ్రామ సంకీర్తలతో ఉత్సవాలు ప్రారంభించి ప్రత్యేక పూజలు, సత్యవ్రతాలు, భజనలు, భక్తిగీతాలాపన, ఊంజల సేవలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిరుపేదలకు అమృత కలశాలు, అన్న ప్రసాదాలను విరణ చేపట్టారు. కార్యక్రమాల్లో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.
(ఆంధ్రజ్యోతి బృందం)



నరసన్నపేట: కిల్లాంలో సత్యసాయి జయంతి వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి



వజ్రపుకొత్తూరు మండలం బైపల్లి, టెక్కలిలో విద్యార్థినుల కోలాట ప్రదర్శన





గార: గోరువానిపేటలో సాయి వ్రతాలు

మాదక ద్రవ్యాలు విక్రయిస్తే కఠిన చర్యలు

● ఏఎస్పీ శ్రీనివాసరావు
● 10 కేజీల గంజాయి స్వాధీనం, ఐదుగురి అరెస్ట్

కోటబొమ్మాళి, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): మాదక ద్రవ్యాలను విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని, వారిపై ప్రత్యేక నిఘా పెట్టామని ఏఎస్పీ (క్రైం) పి.శ్రీనివాస రావు స్పష్టం చేశారు. జర్జంగి గ్రామ సమీపంలో శనివారం గంజాయిని తరలిస్తున్నా రన్న సమాచారంలో ఎస్‌ఐ వి.సత్యనారాయణ ఆధ్వర్యంలో దాడి చేసి 10 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. గంజాయిని తరలిస్తున్న ఒడిశా రాష్ట్రానికి చెందిన ఐదుగురిని అదుపులోకి తీసుకున్నారు. ఈ మేరకు శనివారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో విలేకరుల సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడించారు. ఒడిశాకు చెందిన సురతాజన, జన సుస్మిత, విజయ్‌సింగ్, అర్జునసింగ్, ఆసిస్ జనలు ఐదు ప్లాస్టిక్ సంచుల్లో 10 కేజీల గంజాయిని తరలిస్తుండగా వారిని పట్టుకుని ప్రశ్నించగా ఒడిశాకు చెందిన ప్రదీప్ అనే వ్యక్తి నుంచి గంజాయిని తీసుకొని వచ్చి కోటబొమ్మాళి, పోలాకి, నరసన్నపేట, టెక్కలి పరిసర ప్రాంతాల్లో గ్రానైట్, పాలిష్ తదితర పరిశ్రమల్లో పని చేస్తున్న కార్మికులకు, యువకులకు విక్రయిస్తున్నట్లు ఒప్పుకున్నారన్నారు. వీరిని డీటీ, వీఆర్వో సమక్షంలో విచారించగా ఈ సమాచారం ఇచ్చారన్నారు. దీంతో ఈ ఐదుగురిపై కేసు నమోదు చేసి అరెస్టు చేశామన్నారు. ముఖ్యంగా పిల్లలు మత్తు పదార్థాలకు బానిస అయితే పోలీస్‌లను సంప్రదిస్తే ఎటువంటి కేసులు పెట్టకుండా వారికి కౌన్సెలింగ్ ఇవ్వడం జరుగుతుందన్నారు. సమావేశంలో సీఐ కె.శ్రీనివాసరావు, ఎస్‌ఐ సత్యనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏఎస్పీ శ్రీనివాసరావు



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ వివేకానంద

గంజాయి విక్రయిస్తున్న యువకుడి అరెస్టు

శ్రీకాకుళం రూరల్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): నగరంలో గంజాయి విక్రయిస్తున్న గూనపాలెం చెరువు గట్టు ప్రాంతానికి చెందిన లండ కుమార్‌ని శనివారం అరెస్టు చేసినట్లు శ్రీకాకుళం డీఎస్పీ సీహెచ్.వివేకానంద తెలిపారు. ఈ వివరాలను వన్‌టౌన్ పోలీసు స్టేషన్‌లో విలేకరుల సమావేశంలో డీఎస్పీ వెల్లడించారు. కుమార్ గత కొద్ది రోజులుగా గంజాయి రవాణా చేయడంతో పాటు పొట్లాలుగా చేసి విక్రయిస్తున్నాడనే సమాచారంతో శ్రీకాకుళం సీఐ కె.పైడపునాయుడు ఆధ్వర్యంలో వన్‌టౌన్ ఎస్‌ఐ ఎం.హరికృష్ణ నగరంలోని 80 అడుగుల రోడ్డులో మాటువేశారు. అక్కడ అనుమానాస్పదంగా తిరుగుతున్న కుమార్‌ను పట్టుకుని విచారించారు. చెడు వ్యసనాలకు బానిసై, డబ్బులు సంపాదించాలన్న యావతో ఒడిశాలోని పర్లాకిమిడి నుంచి గంజాయిని కొనుగోలు చేసి నగరంలో యువకులకు విక్రయిస్తున్నట్లు గుర్తించారు. పోలీసులకు అనుమానం రాకుండా గంజాయిని చిన్న చిన్న పొట్లాలుగా తయారు చేసి విక్రయిస్తున్నట్లు డీఎస్పీ చెప్పారు. గంజాయి ఎవరెవరికి విక్రయించింది, ఎవరి నుంచి కొనుగోలు చేసింది తెలుసుకున్నామన్నారు. నిందితుల కోసం గాలిస్తున్నట్లు తెలిపారు. కుమార్ నుంచి 2.1 కేజీల గంజాయి స్వాధీనం చేసుకుని అరెస్టు చేశామన్నారు. అతని తల్లిదండ్రుల అనుమతితో డి-ఎడిక్షన్ సెంటర్‌కు తరలిస్తున్నట్లు తెలిపారు. ఈ కేసులో ప్రతిభ కనబరచిన సీఐ, ఎస్‌ఐ, ఏఎస్ ఐబీ రమేష్‌బాబు, కానిస్టేబుళ్లు ఎస్.రవికుమార్, ఎన్.దుర్గారావు, వై.రమణమూర్తి, ఎం.జగదీష్, ఆర్.సూరిబాబును అభినందించారు. జిల్లాలో గంజాయి నియంత్రణకు డ్రోన్ కెమెరాలతో నిఘా పెట్టినట్లు డీఎస్పీ వివేకానంద తెలిపారు. నదీ పరీవాహక ప్రాంతాల్లో గంజాయి, మత్తు పదార్థాలు సేవించే ఆనవాళ్లను డాగ్స్ ద్వారా గుర్తిస్తున్నట్లు చెప్పారు.

రైల్వే గేటు మూసివేతతో ఇబ్బందులు



టెక్కలి–తొలుసూరుపల్లి రోడ్డులో మూసిన రైల్వేగేటు

టెక్కలి, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): టెక్కలి-తొలుసూరుపల్లి రోడ్డులో రైల్వే ట్రాక్ పనులు శనివారం నిర్వహించారు. రైల్వేస్టేషన్‌కు సమీపంలో ఉన్న ఈ రైల్వేగేటును శనివారం రోజంతా మూసివేయడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పనులపై రైల్వే అధికారులు ముం దస్తుగా సమాచారం ఇచ్చినా విషయం తెలియని ప్రజలు ఇక్కట్లకు గురయ్యారు. సబ్ కలెక్టర్ కార్యాలయం, ఎన్టీఆర్ కాలనీ మీదుగా పాత హైవేకి వాహనాలు దారి మళ్లించడంతో ఈ మార్గం కిక్కిరిసింది. ట్రాక్ మరమ్మతుల అనంతరం సాయంత్రం 6గంటల నుంచి గేటును తెరవడంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు.

రెక్క రాల్చు పురుగులతో పంటకు నష్టం



రెక్కరాల్చు పురుగుతో పడిపోయిన వరిచేను

నందిగాం, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): వల్లభరాయుడు పాడులో రెక్క రాల్చు పురుగు సోకడంతో చేతికి అందివచ్చిన పంట నేలపాలై తీవ్రంగా నష్టం చేసిందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఆరుగాలం శ్రమించి పెట్టుబడి పెట్టి పండించిన పంట కళ్ల ముందే రెక్కరాల్చు పురుగు వల్ల పొలాల్లోనే పడిపోయింది. గ్రామంలో ఎక్కువ మంది రైతులకు చెందిన పంట ఇలా పడిపోవడంతో వారంతా లబోదిబోమంటున్నారు. విషయాన్ని వ్యవసాయాధి కారి పి.శ్రీకాంత్‌వర్మ దృష్టికి తీసుకువెళ్లగా శని వారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులు పంట నష్టాన్ని ఏవోకి వివరించారు. టెక్కలి ఏడీఏ బీవీ తిరుమలరావుకు నష్టం వివరాలను తెలియజేసినట్లు ఏవో తెలిపారు. తమను ఆదుకోవాలని వారు కోరుతున్నారు.

మండలంలో 21 ధాన్యం కొనుగోలు కేంద్రాలు

పోలాకి: 23(ఆంధ్రజ్యోతి): మండలంలో రైతులకు అందుబాటులో ఉండేలా 21 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు వ్యవసాయాధికారి చిరంజీవి తెలిపారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో సచివాలయ సిబ్బందికి, వ్యవసాయ విస్తరణాధికారులకు ప్రత్యేక సమావేశం నిర్వహించారు. త్వరలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తామని, రైతులు ఆందోళనచెందవద్దన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో గరిమెళ్ల వెంకట రవికుమార్, సూపరింటెండెంట్ బలగ సూర్యప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

కోర్టు భవనాల పరిశీలన



పరిశీలిస్తున్న జిల్లా న్యాయాధికారి జేపీ మౌలానా

పలాస, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): కోర్టు భవనాలను మార్చనున్న నేపథ్యంలో కొత్త భవనాలను జిల్లా న్యాయాధికారి జేపీ మౌలానా శనివారం పరిశీలించారు. ప్రస్తుతం పలాస ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎదురుగా ప్రైవేటు భవనంలో ఉన్న కోర్టు ఆవరణలో న్యాయవాదులు, కక్షిదారులకు సౌకర్యంగా లేదని న్యాయవాదులు జిల్లా న్యాయాధికారికి ఫిర్యాదు చేసిన నేపథ్యంలో తహసీల్దార్ కార్యాలయం రోడ్డులో ఎస్‌ఎఫ్‌ఎస్ పాఠశాలకు చెందిన హాస్టల్ భవనాలన పరిశీలించారు. ఇక్కడ కోర్టు ఏర్పాటు చేస్తే అందరికీ సౌకర్యంగా ఉంటుందని ఆయన అభిప్రాయపడ్డారు. న్యాయవాదులు, న్యాయాధికారి చర్చించి సోమవారం నివేదిక అందించాలని ఆయన సూచించారు. ఆయన వెంట స్థానిక న్యాయాధికారి యు.మాధురి, సీఐ డి.మోహనరావు, పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న సివిల్ కోర్టు న్యాయాధికారి హరిప్రియ



ఎల్‌ఈడీ స్క్రీన్‌పై రక్షణ చట్టాలను వివరిస్తున్న న్యాయాధికారి మాధురి

నరసన్నపేట, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): జాతీయ లోక్‌అదాలత్ డిసెంబరు 14న నిర్వహించనున్నామని, దీనిని కక్షిదారులు సద్వినియోగం చేసుకునేలా అవగాహన కలిగించాలని సివిల్ కోర్టు న్యాయాధికారి సీహెచ్ హరిప్రియ సూచించారు. ఈ మేరకు శనివారం కోర్టులో న్యాయవాదులు, పోలీసు, ఎక్సైజ్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. లోక్ అదాలత్‌లో సివిల్, క్రిమినల్ కేసులను రాజీ చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. పెండింగ్‌లో ఉన్న కేసులను ఇరుపక్షాల అంగీకారంతో పరిష్కరిస్తామన్నారు. కార్యాక్రమంలో ఏజీపీ గొండు సత్యనారాయణ, న్యాయవాదులు రోణంకి కృష్ణంనాయుడు, తులుగు మధు, జీవీజీ నాయుడు, ఆర్.కొండలరావు, డి.రాజ్‌కుమార్, సీఐలు శ్రీనివాసరావు, రమణ, ఎస్‌ఐలు దుర్గాప్రసాద్, రంజిత్ పాల్గొన్నారు.

మహిళలు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

వజ్రపుకొత్తూరు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): మహిళలు రక్షణ చట్టాలపై పూర్తిస్థాయిలో అవగాహన కలిగి ఉండాలని పలాస మున్సిఫ్ కోర్టు న్యాయాధికారి మాధురి అన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో శనివారం మహిళా చట్టాలపై న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సమాజంలో మహిళలకు ఎదురవుతున్న సమస్యల్లో రక్షణ ఏవిధంగా పొందాలో వివరించారు. వరకట్న వేధింపులు, ఒంటరి మహిళల వేధింపులపై కోర్టును ఏవిధంగా ఆశ్రయించాలో తెలిపారు. కాశీబుగ్గ డీఎస్పీ వెంకట అప్పారావు మాట్లాడుతూ.. ప్రస్తుతం మహిళల రక్షణకు అనేక చట్టాలు వచ్చాయన్నారు. ఎవరికైనా సమస్యలు ఎదురైతే నేరుగా పోలీస్‌స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేయాలన్నారు. అనంతరం వివిధ చట్టాలపై ఎల్‌ఈడీ స్క్రీన్‌పై చూపించి వివరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ సీతారామ్మూర్తి, ఎంపీడీవో రమేష్‌నాయుడు, సీఐ తిరుపతిరావు, న్యాయ వాదులు హరిప్రియ, సౌజన్య, ఎస్‌ఐ నిహార్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రైతు వ్యతిరేక విధానాలను ప్రతిఘటించాలి



మందస, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం అనుసరి స్తున్న రైతు, కార్మిక వ్యతిరేక విధానాలను ప్రతిఘటించాలని ఆంధ్రప్రదేశ్ రైతుసంఘ జిల్లా కార్యదర్శి కె.మోహనరావు, సీఐటీ యూ నాయకుడు ఆర్.దిలీప్‌కుమార్ కోరారు. ఈ మేరకు శనివారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలకు వ్యతిరే కంగా ఈనెల 26న కలెక్టర్ కార్యాలయం, పలాస ఆర్డీవో కార్యాలయం ఎదుట నిర్వ హించనున్న ధర్నాలను విజయవంతం చేయాలని కోరారు. పెట్టు బడిదారులకు అనుకూలంగా గడచిన పదేళ్లలో రూ.1929 లక్షల కోట్లు రుణమాఫీ, సంపన్నులకు రుణ రాయితీలు కల్పించారని విమ ర్శిం చారు. మధ్యాహ్న భోజన, ఆశావర్కర్లకు కనీసం గుర్తించడం లేదన్నారు. సమావేశంలో రైతు సంఘ మండల కార్యదర్శి మట్ట ధర్మారావు, నాయకులు సి.అప్పలస్వామి, ఎస్.జగ్గారావు, చిన్నారావు, శాంతమూర్తి తదితరులు పాల్గొన్నారు.

విత్తనోత్పత్తికి రైతులు ముందుకు రావాలి

నరసన్నపేట/జలుమూరు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): విత్తనోత్పత్తికి రైతులు ముందుకు రావాలని విత్తనోత్పత్తి సంస్థ జిల్లా మేనేజర్ పి.బాలకృష్ణ సూచించారు. శనివారం నరసన్నపేట మండలం సత్యవరం, జలుమూరు మండలం లింగాలవలస గ్రామాల్లో వరి విత్తనోత్పత్తి కేంద్రాలను పరిశీలించారు. వ్యవసాయాధికారుల సూచనల మేరకు విత్తనాలను అభివృద్ధి చేయాలన్నారు. ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి జిల్లాకు 40 వేల క్వింటాళ్ల విత్తనాలు అవసరం కాగా ప్రస్తుతం జిల్లాలో 12 వేల క్వింటాళ్ల విత్తనాలు మాత్రమే ఉత్పత్తి అవుతున్నాయన్నారు. రైతులు పండించిన విత్తనాలను ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందన్నారు. విత్తనాల నాణ్యతను విజయవాడ క్వాలిటీ అధికారి టి.శివజ్యోతి పరిశీలించారు. కార్యక్రమంలో ప్రొడక్షన్, మార్కెట్ మేనేజర్ బి.జలంధర్, ఏడీఏ రవీంద్రభారతి, ఏవో సునీత, సర్పంచ్ రామచంద్రరావు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

యువత సన్మార్గంలో నడుచుకోవాలి

నరసన్నపేట, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): యువత సన్మార్గంలో నడుచుకోవాలని సీఐ శ్రీనివాసరావు, ప్రిన్సిపాల్ డా.పి.లత కోరారు. శనివారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 'సంకల్ప్'లో భాగంగా విద్యార్థులకు సైబర్ నేరాలు, మత్తుపదార్థాల నియంత్రణపై అవగాహన కలిగించారు. సైబర్ నేరాలకు గురికావద్దని గంజాయి వంటి మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఐ దుర్గాప్రసాద్, అధ్యాపకులు అన్నాజీరావు, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి

మెళియాపుట్టి, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని పాతపట్నం సీఐ రామారావు కోరారు. శనివారం స్థానిక జూనియర్ కళాశాలలో 'సంకల్ప్' పై అవగాహన కలిగించారు. మత్తు పదార్థాలు వాడితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. మత్తు పదార్థాల వల్ల జీవితం నాశనమవుతుందన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఐ రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

చెడు అలవాట్లతో జీవితం నాశనం

వజ్రపుకొత్తూరు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని ఎస్‌ఐ బి.నిహార్ అన్నారు. సంకల్ప్ కార్యక్రమంలో భాగంగా శనివారం డోకులపాడు హైస్కూల్‌లో విద్యార్థులకు వివిధ అంశాలపై అవగాహన కలిగించారు. సరదగా చేసుకున్న చెడు అలవాట్లు జీవితాన్ని నాశనం చేస్తున్నాయని, దీంతో తల్లిదండ్రులు సమాజంలో తలెత్తు కోలేని పరిస్థితి ఏర్పడుతుందన్నారు. చదవు, ఆటలపై దృష్టిని కేంద్రీకరించి ఉన్నత భవిష్యత్‌ను పొందాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

'అభివృద్ధిని చూసి ఓర్వలేకే అభాండాలు'

జలుమూరు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): టీడీపీ చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేకే వైసీపీ నాయకులు అభాండాలు వేస్తున్నారని టీడీపీ మండల అధ్యక్షుడు వెలమల రాజేంద్రనాయుడు అన్నారు. చల్లవానిపేటలో శనివారం విలేకరులతో మాట్లాడుతూ.. ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి నియోజకవర్గంలో చేసిన అభివృద్ధిపై శాసనసభలో మాట్లాడితే వైసీపీ నాయకులు అసెంబ్లీ సాక్షిగా అబద్ధాలు చెప్పారని విమర్శించడం తగదన్నారు. వైసీపీ నేతల విమర్శలకు ప్రజలు నవ్వుకుంటున్నారన్నారు. సమావేశంలో టీడీపీ నేతలు బగ్గు గోవిందరావు, సర్పంచ్‌లు పంచిరెడ్డి రామచంద్రరావు, దుంగ స్వామిబాబు పాల్గొన్నారు.

ఘనంగా అభయాంజనేయ మందిర వార్షికోత్సవం



కళాకారులను అభినందిస్తున్న దృశ్యం

హరిపురం, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): బాలిగాం గ్రామంలో అభయాంజనేయ మందిర 30వ వార్షికోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. స్వామికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, భజనలు చేపట్టారు. ఈ సందర్భంగా కళాకారులను సత్కరించి నూతన వస్త్రాలను అందిం చారు. కార్యక్రమంలో కోదండరాం, నారాయణరావు, పాపారావు, రాజారావు, కిశోర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు లక్ష దీపారాధన

కొత్తూరు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం పురస్కరించుకొని శ్రీపంచముఖ అభయాంజనేయ స్వామి ఆలయ ఆవరణలో ఆదివారం లక్ష దీపారాధన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమి టీ సభ్యులు తెలిపారు. ప్రత్యేక పూజలు, మధ్యాహ్నం అన్న సమారాధన, సాయంత్రం లక్ష దీపారాధన ఏర్పాట్లు చేస్తున్నట్టు కమిటీ సభ్యుడు బరాటం గోవిందరావు తెలిపారు. భక్తులు పాల్గొనాలని కోరారు.

1000 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం

సోంపేట, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): మందస మండలం కొండలోగాంలో ఎక్సైజ్ అధికారులు శనివారం దాడులు నిర్వహించారు. వెయ్యి లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేసినట్లు సీఐ కె.బాబీ తెలిపారు.

ఈనెల 29న 'చలో శ్రీకాకుళం'

పాతపట్నం నవంబరు 23(ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకిస్తూ ఈనెల 29న నిర్వహించనున్న 'చలో శ్రీకాకుళం' కార్యక్రమానికి తరలిరావాలని ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి ప్రతినిధులు కోరారు. స్థానిక పంచాయతీ కార్యాలయ ప్రాంగణంలో శనివారం మాలమహానాడు మండల అధ్యక్షుడు తొగిరి లక్ష్మీనారాయణ చలో శ్రీకాకుళం కరపత్రాలను ఆవిష్కరించారు. మాలమహానాడు మండల కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడిగా సల్ల పాపయ్య, అధ్యక్షుడిగా తొగిరి లక్ష్మీనారాయణ, ఉపాధ్యక్షులుగా సీమల మాధవరావు, కొప్పల అప్పారావు, కుప్పిలి శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శిగా నవగాన రత్న కుమార్‌తో పాటు ఇతర కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారి గా యజ్జల భాస్కరరావు వ్యవహరించారు. కార్యక్రమంలో సిర్ల జోగారావు, సిర్ల ప్రభాకరరావు, నవగాన రత్న కుమార్ పాల్గొన్నారు.